నయా చేతక్ ఎలక్ట్రిక్ స్కూటర్

సింగిల్ చార్జింగ్‌తో 153 కి.మీ. • గరిష్ఠ ధర రూ.1.27 లక్షలు

పూణె, డిసెంబర్ 20: ప్రముఖ ద్విచక్ర వాహన సంస్థ బజాజ్ ఆటో..చేతక్ బ్రాండ్‌లో మరో ఎలక్ట్రిక్ స్కూటర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. 35 సిరీస్‌లో భాగంగా సంస్థ విడుదల చేసిన స్కూటర్లు మూడు రకాలు 3501, 3502, 3503గా లభించనున్నాయి. తొలి రెండు స్కూటర్ల ధర వరుసగా రూ.1.27 లక్షలు, రూ.1.20 లక్షలుగా నిర్ణయించిన సంస్థ, మూడో మాడల్ ధరను ప్రకటించలేదు. ఈ ధరలు బెంగళూరు షోరూంనకు సంబంధించినవి. వీటిలో 3501 రకం ఈ నెల చివరి నుంచి, మరో రకం 3502 మాడల్ వచ్చే నెల నుంచి డెలివరీ చేయనున్నట్లు బజాజ్ ఆటో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాకేశ్ శర్మ తెలిపారు. వచ్చే ఏడాది ఈ-స్కూటర్‌ను ఇతర దేశాలకు ఎగుమతి చేసేయోచనలో సంస్థ ఉన్నట్లు చెప్పారు. ఈ-స్కూటర్ విభాగంలో సంస్థకు 27.6 శాతం వాటా ఉన్నది.

చేతక్ ఈ-స్కూటర్ ప్రత్యేకతలు

- సింగిల్ చార్జింగ్‌తో 153 కిలోమీటర్లు ప్రయాణించనున్నది.
- 3.5 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన ఈ స్కూటర్ గంటకు 73 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించనున్నది.
- ఈ స్కూటర్ రూ.1.2-1.27 లక్షల ధరల శ్రేణిలో నిర్ణయించింది.
- 3.25 గంటల్లో బ్యాటరీ 80 శాతం రీచార్జికానున్నది.

ఆయూశి (4/10)

ఆయూశి విజృంభణ

ఫైనల్లో యువ భారత్ • అండర్-19 ఆసియాకప్ టోర్నీ

సింగపూర్: అరంగేట్రం మహిళల అండర్-19 ఆసియాకప్ టోర్నీలో భారత్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో యువ భారత్ 4వికెట్ల తేడాతో శ్రీలంకపై ఘన విజయం సాధించింది. టోర్నీలో అపజయమెరుగని భారత్..తుది పోరులో నిలిచింది. తొలుత ఆయూశీ శుక్లా(4/10) ధాటికి లంక 20 ఓవర్లలో 98/9 స్కోరుకు పరిమితమైంది. ఈ యువ లెఫ్టార్మ్ స్పిన్నర్ ధాటికి లంక బ్యాటర్లు స్వల్ప స్కోర్లకే వెనుదిరిగారు. కెప్టెన్ మనుడి నానయకర(33) టాప్‌స్కోరర్‌గా నిలిచింది. పిచ్ పరిస్థితులను సద్వినియోగం చేసుకుంటూ ఆయూశి స్పిన్ మాయాజాలంతో చెలరేగడంతో లంక దగ్గర సరైన సమాధానం లేకపోయింది. ఓపెనర్లు సంజన(9), హిరుణి హన్సిక(2) 12 పరుగులకే పెవిలియన్ చేరగా, ఐదో వికెట్‌కు నానయకర, నిసాసల నెలకొల్పిన 22 పరుగుల భాగస్వామ్యం అత్యుత్తమమైంది. ఆయూశీకి తోడు పరునిక సిసోడియా(2/27) రెండు వికెట్లు పడగొట్టారు. ఆ తర్వాత 99 పరుగుల కోసం లక్ష్యఛేదనకు దిగిన భారత్ 14.5 ఓవర్లలో 102/6 స్కోరు చేసింది. పరుగుల ఖాతా తెరువకుండానే ఐశ్వరి(0) ఔట్ కాగా, కమలిని(28) ఆకట్టుకుంది. టోర్నీలో తన సూపర్‌ఫామ్‌ను కొనసాగిస్తున్న తెలంగాణ యువ బ్యాటర్ గొంగడి త్రిష(32) అత్యధిక స్కోరుతో జట్టు విజయంలో కీలకమైంది. లంక బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ త్రిష తన ఇన్నింగ్స్‌లో 2 ఫోర్లు, 3 భారీ సిక్స్‌లతో అలరించింది. సనిక(4), కెప్టెన్ నికి ప్రసాద్(3), భవిక(7) విఫలమయ్యారు. ప్రభోద (3/16), గిమ్హాని (2/18) ఆకట్టుకున్నారు. నాలుగు వికెట్లతో విజయంలో కీలకమైన ఆయూశికి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

సంక్షిప్త స్కోర్లు

శ్రీలంక: 20 ఓవర్లలో 98/9(నానయకర 33, నిసాసల(21), ఆయూశి 4/10, పరునిక 2/27),
భారత్: 14.5 ఓవర్లలో 102/6 (త్రిష 32, కమలిని 28, ప్రభోద 3/16, గిమ్హాని 2/18)

హోండా కార్లు ప్రియం

న్యూఢిల్లీ, డిసెంబర్ 20: వచ్చే నెల నుంచి వాహన ధరలను 2 శాతం వరకు పెంచబోతున్నట్లు హోండా కార్స్ ఇండియా ప్రకటించింది. ఉత్పత్తి వ్యయం పెరగడంతో పాటు లాజిస్టిక్ ఖర్చులు అధికమవడంతో సంస్థపై పడుతున్న భారాన్ని తగ్గించుకోవడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు కంపెనీ వైస్ ప్రెసిడెంట్ కునల్ బెహ్లా తెలిపారు. ప్రస్తుతం సంస్థ అమేజ్, సిటీ, ఎలివేట్ మాడళ్లను దేశీయంగా విక్రయిస్తున్నది.

హైదరాబాద్‌కు వ్యాన్‌గార్డ్

హైదరాబాద్, డిసెంబర్ 20: డిజిటల్ టెక్నాలజీ సంస్థ వ్యాన్‌గార్డ్..హైదరాబాద్‌లో నూతన టెక్నాలజీ ఆఫీస్‌ను తెరవబోతున్నట్లు ప్రకటించింది. వచ్చే ఏడాది అందుబాటులోకి రాబోతున్న ఈ నూతన టెక్నాలజీ ఆఫీస్‌తో వందలాది మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయని కంపెనీ గ్లోబల్ సీఎఫ్‌వో నితిన్ టండన్ తెలిపారు.

స్టాండర్డ్ గ్లాస్‌లో అమాన్సా 40 కోట్ల పెట్టుబడి

హైదరాబాద్, డిసెంబర్ 20: స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ లిమిటెడ్‌లో అమాన్సా ఇన్వెస్ట్‌మెంట్స్ రూ.40 కోట్ల పెట్టుబడులు పెట్టింది. ముందస్తు ఐపీవో ఫండింగ్‌లో భాగంగా ఈ పెట్టుబడులు పెట్టింది. షేరుకు ఒక్కింటికి రూ.140 చొప్పున 28.57 లక్షల షేర్లను కేటాయించింది.

ఆవిరైన 18 లక్షల కోట్లు

గత ఐదు రోజులో మదుపరుల నష్టపోయిన సంపద
4 వేల పాయింట్లకు పైగా నష్టపోయిన సెన్సెక్స్

ముంబై, డిసెంబర్ 20: స్టాక్ మార్కెట్ల నష్టాల పరంపర కొనసాగుతున్నది. వచ్చే ఏడాది రేట్లను ఆశించిన స్థాయిలో కోతలు ఉండకపోవచ్చన్న అమెరికా ఫెడరల్ రిజర్వు సంకేతాలు ఇవ్వడం మదుపరుల్లో సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. దీంతో వరుసగా అంతర్జాతీయ మార్కెట్లు నష్టాల్లో ట్రేడవుతుండటం, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీగా తమ పెట్టుబడులను తరలించుకుపోతుండటంతో వరుసగా ఐదో రోజూ శుక్రవారం సూచీలు నష్టాలు ఏరులైపారాయి. ఇంట్రాడేలో 1,300 పాయింట్లకు పైగా నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 1,176. 46 పాయింట్లు లేదా 1.49 శాతం పతనం చెంది 79 వేల పాయింట్ల దిగువకు 78,041. 59 వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ కూడా 364.20 పాయింట్లు లేదా 1.52 శాతం కోల్పోయి 23,587.50 వద్ద ముగిసింది. దీంతో వరుసగా ఐదు రోజుల్లో మదుపరులు రూ.18 లక్షల కోట్లకు పైగా సంపదను కోల్పోయారు. దీంతో బీఎస్ఈలో లిస్టైన సంస్థల మార్కెట్ విలువ రూ.18,43,121. 27 కోట్లు కరిగిపోయి రూ.4,40,99,217. 32 కోట్లకు(5.18 ట్రిలియన్ డాలర్లు)కు పడిపోయింది. గత ఐదు సెషన్లలో సెన్సెక్స్ 4,091.53 పాయింట్లు లేదా 4.98 శాతం, నిఫ్టీ 1,180.8 పాయింట్లు లేదా 4.76 శాతం కోల్పోయింది.



కరిగిపోతున్న విదేశీ నిల్వలు

ముంబై, డిసెంబర్ 20: విదేశీ మారకం నిల్వలు కరిగిపోతున్నాయి. వరుసగా కొన్ని వారాలుగా తగ్గుతూ వచ్చిన ఫారెక్స్ రిజర్వులు గతవారంలోనూ 2 బిలియన్ డాలర్లకు తరిగిపోయాయి. దీంతో ఈ నెల 13తో ముగిసిన వారాంతానికిగాను విదేశీ మారకం నిల్వలు 1.988 బిలియన్ డాలర్లు తగ్గి 652.869 బిలియన్ డాలర్లకు పడిపోయాయని రిజర్వు బ్యాంక్ వారాంతపు సమీక్షలో వెల్లడించింది. అంతక్రితం వారంలోనూ రిజర్వులు 3.235 బిలియన్ డాలర్లు తగ్గిన విషయం తెలిసిందే. డాలర్‌తో పోలిస్తే ఇతర కరెన్సీలు తీవ్ర హెచ్చుతగ్గుదలకు లోనుకావడంతో విదేశీ కరెన్సీ రూపంలో ఉన్న ఆస్తుల విలువ 3.047 బిలియన్ డాలర్లు పతనమై 562.576 బిలియన్ డాలర్లకు తగ్గాయని పేర్కొంది. కానీ, పసిడి రిజర్వులు 1.121 బిలియన్ డాలర్లు ఎగబాకి 68.056 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. సెప్టెంబర్‌లో 704.885 బిలియన్ డాలర్లకు చేరుకున్న రిజర్వులు గడిచిన నాలుగు నెలల్లో ఏకంగా 50 బిలియన్ డాలర్లకు పైగా తగ్గాయి.

ఆల్‌ఇండియా రన్నరప్ అనన్య

అంబర్‌పేట, డిసెంబర్ 20: చండీగఢ్ వేదికగా జరిగిన ఆల్‌ఇండియా టెన్నిస్ అసోసియేషన్(ఏఐటీఏ) ఆధ్వర్యంలో జరిగిన అండర్-18 టోర్నీలో తెలంగాణ ప్లేయర్ వారణాసి సాయిఅనన్య రన్నరప్‌గా నిలిచింది. శుక్రవారం జరిగిన ఫైనల్లో అనన్య 3-6, 1-6 తేడాతో ఆనందిత ఉపాధ్యాయ(హర్యానా) చేతిలో ఓడి రన్నరప్ టైటిల్ దక్కించుకుంది. తుది పోరులో ప్రత్యర్థికి దీటైన పోటీనివ్వడంలో ఈ యువ ప్లేయర్ విఫలమైంది. అనన్యకు టోర్నీ నిర్వహకులు దినేశ్ అరోరా, హిమాంశు మాలిక్ ట్రోఫీతో పాటు సర్టిఫికేట్ అందజేశారు.

సెమీస్‌లో తెలంగాణ

జాతీయ సబ్‌జూనియర్ బాస్కెట్‌బాల్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: సరూర్‌నగర్ స్టేడియం వేదికగా జరుగుతున్న 49వ జాతీయ సబ్‌జూనియర్ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ బాలికల జట్టు సంచలనం సృష్టించింది. శుక్రవారం జరిగిన క్వార్టర్స్‌లో తెలంగాణ 74-73తో డిఫెండింగ్ చాంపియన్ చత్తీస్‌గఢ్‌ను చిత్తు చేస్తూ సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. ఆఖరి క్షణం వరకు హోరాహోరీగా మ్యాచ్‌లో తెలంగాణ ప్లేయర్లు అద్భుత ప్రదర్శన కనబరిచారు. రాష్ట్ర జట్టు తరపున మైత్రి(23), ఆరాధ్య(22), చైత్ర(13) విజృంభించారు. అంతకుముందు జరిగిన ప్రీక్వార్టర్స్‌లో తెలంగాణ 64-63తో ఏపీపై గెలిచింది.

సామ్ కాన్‌స్టస్‌కు చోటు

భారత్‌తో టెస్టులకు ఆసీస్ జట్టు

మెల్‌బోర్న్: బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ(బీజీటీ) సిరీస్‌లో భారత్‌తో మిగిలిన రెండు టెస్టుల కోసం క్రికెట్ ఆస్ట్రేలియా(సీఏ) శుక్రవారం జట్టును ఎంపిక చేసింది. పేలవ ఫామ్‌తో సతమతమవుతున్న నాథన్ మెక్‌స్వీనిని తప్పిస్తూ యువ సంచలనం సామ్ కాన్‌స్టస్‌కు ఆసీస్ జట్టులో చోటు కల్పించింది. ఒక వేళ టీమ్‌ఇండియాతో బాక్సింగ్ డే టెస్టులో సామ్‌కు తుది జట్టులో చోటు లభిస్తే..ఆసీస్ తరపున గత 70 ఏండ్లలో అరంగేట్రం చేయనున్న పిన్న వయసు బ్యాటర్‌గా నిలుస్తాడు. 1953లో ఇయాన్ క్రేగ్(17 ఏండ్ల 239రోజులు) తర్వాత సామ్ ఈ ఘనత అందుకోనున్నాడు. దేశవాళీ టోర్నీ షెఫీల్డ్ షీల్డ్ టోర్నీలో కొన్సాస్.. న్యూసౌత్ వేల్స్ తరపున నిలకడగా రాణించాడు. సామ్‌తో పాటు జే రిచర్డ్‌సన్, బ్యూ వెబ్‌స్టర్, బోలాండ్ జట్టులో చోటు దక్కించుకున్నారు.

వీసా కోసం అర్జున్ అభ్యర్థన



న్యూఢిల్లీ: న్యూయార్క్ వేదికగా జరిగిన వరల్డ్ ర్యాపిడ్, బ్లిజ్ చాంపియన్‌షిప్‌లో పోటీపడేందుకు తనకు వీసా మంజూరు చేయాలని యూఎస్ ఎంబసీని భారత యువ జీఎం ఇరిగేసి అర్జున్ కోరాడు. వారం రోజుల వ్యవధిలో మొదలయ్యే మెగాటోర్నీ కోసం వీసా ఇవ్వాల్సిందిగా ఎక్స్‌లో అభ్యర్థించాడు. దీనికి తోడు వీసా జారీ విషయంలో తనకు మద్దతుగా నిలువాల్సిందిగా కేంద్ర విదేశాంగ మంత్రి జైశంకర్, క్రీడా మంత్రి మన్సుక్ మాండవీయా, ఆల్‌ఇండియా చెస్ ఫెడరేషన్(ఏఐసీఎఫ్)ను అర్జున్ కోరాడు. ఆరు రోజుల పాటు జరిగే టోర్నీలో మాజీ ప్రపంచ చాంపియన్ మాగ్నస్ కార్ల్‌సన్‌తో పాటు ఫాబియానో కరువన, ఇయాన్ నెపోమియాచి, బోరిస్ గెల్ఫాండ్ బరిలో ఉన్నారు.

టైటాన్స్ ఘన విజయం

పుణె: ప్రొ కబడ్డీ లీగ్(పీకేఎల్) 11వ సీజన్ లీగ్ దశను తెలుగు టైటాన్స్ విజయంతో ముగించింది. శుక్రవారం జరిగిన తమ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో టైటాన్స్ 48-36 తేడాతో పుణెరి పల్టాన్‌పై అద్భుత విజయం సాధించింది. టైటాన్స్ జట్టులో కెప్టెన్ పవన్ సెహ్రావత్(15 పాయింట్లు) మరోసారి సూపర్-10తో కదంతొక్కాడు. పవన్‌కు తోడు ఆశీష్ నార్వల్ (11), డిఫెండర్ అంకిత్(6) కూడా సత్తాచాటారు. పుణె జట్టులో అజిత్(10), ఆర్యవర్ధన్ (8) ఆకట్టుకున్నారు. మొత్తం 22 మ్యాచ్‌ల్లో 12 విజయాలు సాధించిన టైటాన్స్ 66 పాయింట్లతో యూ ముంబాతో సమంగా నిలిచింది. లీగ్‌లో ఇప్పటికే ఐదు బెర్తులు ఖరారు కాగా, మరో బెర్తు ఎవరిదో త్వరలో తేలనుంది. మరోవైపు 21 మ్యాచ్‌ల్లో 10వ ఓటమితో పుణె(55) ప్లేఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించింది.

రామ్‌చరణ్‌లో తెలియని శక్తి ఉంది

'రామ్‌చరణ్‌ని చూస్తే.. తన లోపల ఏదో శక్తిని కంట్రోల్ చేసి పెట్టుకుంటున్నట్టుగా కనిపిస్తాడు. సందర్భం వచ్చినప్పుడు అది విస్ఫోటనం చెందుతుందేమో?! అనిపిస్తుంది. లోతైన భావాలను పలికించగల గొప్ప నటుడు తను. ఎంత కష్టసాధ్యమైన సన్నివేశాన్నయినా అద్భుతంగా హ్యాండిల్ చేయగల సమర్థత అతని సొంతం.' అని అగ్ర దర్శకుడు శంకర్ కొనియాడారు. ఆయన దర్శకత్వంలో రామ్‌చరణ్ నటిస్తున్న చిత్రం 'గేమ్‌ఛేంజర్'. కియారా అద్వానీ, అంజలి హీరోయిన్లు. దిల్‌రాజు నిర్మాత. సంక్రాంతి కానుకగా జనవరి 10న పాన్ ఇండియా స్థాయిలో సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ కథకు రామ్‌చరణ్‌ను ఎంచుకోడానికి గల కారణాలను తెలుపుతూ దర్శకుడు శంకర్ పై విధంగా స్పందించారు. ' 'ఆర్‌ఆర్‌ఆర్' రిలీజ్‌కి ముందే రామ్‌చరణ్ ఈ సినిమా చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ కథకు రామ్‌చరణ్ కరెక్ట్ అని దిల్‌రాజు కూడా భావించారు. నా కథల్లో యూనివర్సల్ అప్పీల్ ఉంటుంది. పెద్ద హీరో చేస్తేనే దానికి న్యాయం జరుగుతుంది. అందుకే.. అదే పర్‌ఫెక్ట్ ఛాయిస్ అని నేనూ భావించా. అవినీతిని నిర్మూలించే ఐఏఎస్ అధికారిగా ఇందులో చరణ్ కనిపిస్తారు. ఊహలకు అందని అద్భుతాలు ఇందులో ఉంటాయి.' అని శంకర్ తెలిపారు. ఈ సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్ అమెరికాలో నిర్వహించనున్న విషయం తెలిసిందే. డైరెక్టర్ సుకుమార్ ఈ వేడుకకు అతిథిగా రానున్నారు. అలాగే, ఏపీ రాజధాని అమరావతిలోనూ ఓ భారీ ఈవెంట్ జరుపనున్నట్టు తెలుస్తున్నది. ఆ వేడుకకు పవన్‌కల్యాణ్ అతిథిగా రానున్నట్టు సమాచారం.

చిత్రం

చివరకు మిగిలేది అదే

'లైగర్'తో తెలుగు ప్రేక్షకులకు చేరువైన బాలీవుడ్ బ్యూటీ అనన్య పాండే.. కొత్త సంవత్సరానికి బాధ్యతగా స్వాగతం పలుకుతూ తన సోషల్ మీడియా వేదికగా ఓ పోస్ట్ పెట్టింది. 'ఈ ఏడాది చాలా ప్రేమను పొందాను. తనను ప్రేమించే చాలామంది వ్యక్తుల్ని కలుసుకున్నాను. రాబోవు ఏడాది ఈ ప్రేమ ఇలాగే కొనసాగాలి. ముఖ్యంగా నాతోపాటు అందరికీ మంచి ఆరోగ్యం చేకూరాలి. ఎందుకంటే చివరకు మిగిలేది అదే..' అంటూ కాస్తంత నిర్వేదం, ఇంకాస్త వైరాగ్యాన్ని తన పోస్ట్‌లో పొందుపరచింది అనన్య పాండే. ఇదిలావుంటే.. ఆదిత్యరాయ్ కపూర్‌తో విడిపోయిన ఈ అందాలభామ ప్రస్తుతం వాకర్ బ్లాంకో అనే వ్యక్తితో రిలేషన్‌లో ఉన్నట్టు బాలీవుడ్ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. అనంత్ అంబానీ జంతు సంరక్షణ కేంద్రమైన 'వంతారా'లో వాకర్ బ్లాంకో కీలకమైన బాధ్యతను నిర్వహిస్తున్నారు. వారిద్దరి ఇన్‌స్టా పోస్టులు కూడా ఈ పుకార్లకు బలాన్నిస్తున్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

కనకరాజు కబుర్లు

వరుణ్‌తేజ్ తాజా సినిమాకు 'కొరియన్ కనకరాజు' అనే టైటిల్ ఖరారు చేసిన విషయం తెలిసిందే. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్టైన్మెంట్స్ కలిసి నిర్మిస్తున్న ఈ చిత్రానికి మేర్లపాక గాంధీ దర్శకుడు. ఈ సినిమా కథ విషయంలో ఆసక్తికరమైన విషయాలు వెలుగు చూస్తున్నాయి. రాయలసీమ నేపథ్యంతో కూడిన హారర్ కథతో ఈ సినిమా తెరకెక్కనున్నదట. టైటిల్‌కి తగ్గట్టే ఈ సినిమాలో కొరియన్ బ్యాక్‌డ్రాప్ కూడా ఉంటుందని తెలిసింది. ఇప్పటివరకూ ఎవరూ టచ్ చేయని ఓ కొత్త పాయింట్‌తో ఈ సినిమా ఉంటుందని సమాచారం. ఇదిలావుంటే ఈ సినిమాలో కథానాయికగా రితికా నాయక్ సెలక్టయింది. 'అశోకవనంలో అర్జునకల్యాణం' ఈ అమ్మాయి తొలి సినిమా. ఆ తర్వాత 'హాయ్ నాన్న'లో కూడా కనిపించింది. ప్రస్తుతం 'మిరాయ్'లో నటిస్తున్నది. ఇటీవలే ఈ సినిమా కోసం రితికకు టెస్ట్ లుక్ కూడా నిర్వహించారట. జనవరి నుంచి ఈ సినిమా షూటింగ్ మొదలుకానుంది.

సోహైల్ ఆగమనం

కల్యాణ్‌రామ్ నటిస్తున్న ఎమోషనల్ యాక్షన్ థ్రిల్లర్ 'ఎన్ఆర్‌కే 21'(వర్కింగ్ టైటిల్). సీనియర్ నటి విజయశాంతి ఇందులో కీలక పాత్ర పోషిస్తున్న విషయం తెలిసిందే. ప్రదీప్ చిలుకూరి దర్శకుడు. అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మాతలు. ప్రస్తుతం హైదరాబాద్ అల్యూమినియం ఫ్యాక్టరీలో హీరో కల్యాణ్‌రామ్‌పై దర్శకుడు సునీల్ కీలక సన్నివేశాలను తెరకెక్కిస్తున్నారు. ఇదిలావుంటే.. ఈ సినిమాలో సోహైల్‌ఖాన్ ఇంపార్టెంట్ రోల్ ప్లే చేస్తున్నారు. ఈ రోజు ఆయన పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమాలోని ఆయన ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో బ్లాక్ అండ్ బ్లాక్‌లో గ్లాసెస్ ధరించి, స్టైలిష్ అవతార్‌లో సోహైల్‌ఖాన్ కనిపిస్తున్నారు. ఈవిల్డోర్‌గా ఇందులో ఆయన పాత్ర సినిమాకు హైలైట్‌గా నిలుస్తుందని దర్శకుడు చెబుతున్నారు. శ్రీకాంత్, సాయి మంజ్రేకర్ ముఖ్య పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కథనం: శ్రీకాంత్ విస్సా, కెమెరా: రామ్‌ప్రసాద్, సంగీతం: అజనీష్ లోక్‌నాథ్, సమర్పణ: ముప్పా వెంకయ్యచౌదరి, నిర్మాణం: అశోక క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్.

ఓ స్త్రీ న్యాయపోరాటం

మలయాళ అగ్ర నటుడు సురేశ్‌గోపి, అనుపమ పరమేశ్వరన్ ముఖ్య పాత్రల్లో రూపొందిన చిత్రం 'జానకి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ'(జె.ఎస్.కె). యదార్థ సంఘటనల ఆధారంగా తెరకెక్కిన ఈ చిత్రానికి ప్రవీణ్ నారాయణన్ దర్శకుడు. జె.ఫణీంద్రకుమార్ నిర్మాత. ఉత్కంఠకు గురిచేసే కోర్ట్ డ్రామాగా ఈ సినిమా రూపొందిందని, జానకి అనే స్త్రీ తనకు జరిగిన అన్యాయాన్ని కోర్టు ద్వారా ఎలా ఎదుర్కొన్నది అనేదే ఈ సినిమా ప్రధాన ఇతివృత్తమని, కేసు వాదించే లాయర్‌గా సురేశ్‌గోపీ నటించారని, ఫిబ్రవరిలో సినిమాను విడుదల చేస్తామని మేకర్స్ తెలిపారు. బైజు సంతోష్, మాధవ్ సురేశ్‌గోపి, దివ్య పిళ్లయి, అస్కర్ అలీ తదితరులు ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: రెనదివ్, సంగీతం: గిరీష్ నారాయణన్, జిబ్రాన్, నిర్మాణం: కాస్మోస్ ఎంటర్టైన్మెంట్స్.

ప్రేమ, ప్రతీకారం



పూర్వాజ్ స్వీయ దర్శకత్వంలో నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'కిల్లర్'. జ్యోతి పూర్వాజ్, విశాల్ రాజ్, గౌతమ్ ఇందులో ముఖ్య పాత్రధారులు. పూర్వాజ్ ప్రజయ్ కామత్, ఎ.పద్మనాభరెడ్డి, నిర్మాతలు. ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ జరుపుకుంటున్నది. హైదరాబాద్ రామోజీ ఫిల్మ్ సిటీ, వికారాబాద్ పరిసరాల్లో సెకండ్ షెడ్యూల్ చిత్రీకరించారు. హీరో పూర్వాజ్, హీరోయిన్ జ్యోతి పూర్వాజ్, విశాల్‌రాజ్, గౌతమ్ ఈ షెడ్యూల్‌లో పాల్గొన్నారు. హీరో, దర్శకుడు పూర్వాజ్ మాట్లాడుతూ 'ప్రేమ, ప్రతీకారం, రొమాన్స్ నేపథ్యంలో సాగే థ్రిల్లర్ సినిమా ఇది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఈ కథలో కీలక పాత్ర పోషిస్తున్నది. త్వరలోనే షూటింగ్ పూర్తిచేసి మీ ముందు కొస్తాం. ఓ స్పెషల్ మూవీగా ఆడియన్స్ మనసుల్లో నిలిచిపోయే సినిమా ఇది' అని చెప్పారు. ఈ చిత్రానికి కెమెరా: జగదీశ్ బొమ్మిశెట్టి, సంగీతం: అషీర్ ల్యూక్, సుమన్ జీవరతన్, నిర్మాణం: థింక్ సినిమాస్, మెర్జ్ ఎస్ఆర్, ఏయు అండ్ ఐ.

సూపర్ నాచురల్ శంబాల

ఆది సాయికుమార్ నటిస్తున్న సూపర్ నాచురల్ థ్రిల్లర్ 'శంబాల'. అర్చన అయ్యర్ కథానాయిక. యుగంధర్ ముని దర్శకుడు. రాజశేఖర్ అన్నభీమోజు, మహిధర్‌రెడ్డి నిర్మాతలు. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ హైదరాబాద్ రామోజీఫిల్మ్ సిటీలో మొదలైంది. ఇందులో ఆది సాయికుమార్ జియో సైంటిస్ట్‌గా కనిపించనున్నారు. ఇండియన్ స్క్రీన్‌పై ఇప్పటి వరకూ టచ్ చేయని పాయింట్‌తో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నామని, హాలీవుడ్ స్థాయి నిర్మాణ విలువలతో హై టెక్నికల్ స్టాండర్డ్స్‌తో, గ్రాండ్ విజువల్స్‌తో 'శంబాల' చిత్రాన్ని రూపొందించనున్నామని, ఆది కెరీర్‌ని మలుపు తిప్పే సినిమా అవుతుందని నిర్మాతలు నమ్మకం వ్యక్తం చేస్తున్నారు. శ్వాసిక, రవివర్మ, మీసాల లక్ష్మణ్, మధునందన్ ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి శ్రీరామ్ మద్దూరి సంగీతాన్ని అందిస్తున్నారు.

'మా నాన్న స్టేజ్ ఆర్టిస్ట్. ఆ ప్రభావం నాపై తెలియకుండానే పడింది. అందుకే కెరీర్ పరంగా వేరే ఆప్షనేం పెట్టుకోలేదు. సెకండ్ ఇంటర్ అవ్వగానే జమ్ము నుంచి ముంబై వచ్చి యాక్టింగ్ కోర్స్‌లో చేరిపోయాను. కోర్స్ అవ్వగానే ఆడిషన్స్ ఇవ్వడం మొదలుపెట్టా. కొన్ని యాడ్స్‌లో నటించా. హీరోయిన్‌గా 'డ్రింకర్ సాయి' నా తొలి సినిమా' అని తెలిపింది ఐశ్వర్యశర్మ. 'డ్రింకర్ సాయి' సినిమా ద్వారా ఆమె కథానాయికగా పరిచయం అవుతున్నది. ధర్మ హీరోగా కిరణ్ తిరుమలశెట్టి దర్శకత్వంలో బసవరాజు శ్రీనివాస్, ఇస్మాయిల్ షేక్, బసవరాజు లహరిధర్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ నెల 27న విడుదల కానుంది. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో విలేకరులతో ముచ్చటించింది ఐశ్వర్యశర్మ . 'ఇది అద్భుతమైన ప్రేమకథ. ఇందులో నా పాత్ర పేరు బాగీ. మెడికల్ స్టూడెంట్‌ని. చాలా బలమైన పాత్ర. చూడ్డానికి ఇన్నోసెంట్‌గా కనిపిస్తా. కానీ రఫ్ అండ్ టఫ్‌గా ఉంటా. రెగ్యులర్ హీరోయిన్లకు భిన్నమైన పాత్ర అనమాట. ఛాలెంజ్‌గా తీసుకొని చేశా.' అని తెలిపింది ఐశ్వర్య శర్మ. డ్రింకర్ సాయిగా ధర్మ చాలా బాగా నటించారని, సాంకేతికంగా అన్ని విధాలుగా సినిమా బావుంటుందని, అర్జున్‌రెడ్డికీ డ్రింకర్‌సాయికీ పోలిక లేదని, అర్జున్ క్లాసీ డ్రింకర్ అయితే.. సాయి మ్యాసీ డ్రింకర్ అని చెప్పింది ఐశ్వర్యశర్మ.

చూడ్డానికే అమాయకంగా ఉంటా..